సాక్షి
మంచిర్యాల

శనివారం । 11 । అక్టోబర్ । 2025



మహిళలు.. మహారాణులు!
మహిళలు విద్య, రాజకీయం, ఉద్యోగాలతోపాటు వ్యాపారం రంగంలోనూ రాణిస్తున్నారు. డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని వ్యాపారాలు చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. 8లో▸



నేడు విద్యుత్ అంతరాయం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపి వేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /23.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యథావిధిగా ప్రజావాణి
నస్పూర్: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ సందర్భంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నిలిపివేసిన నేపథ్యంలో ఈ నెల 13 నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

13న హోమియోపతి ఉచిత వైద్య శిబిరం


కలెక్టర్ కుమార్‌దీపక్‌కు కరపత్రం అందిస్తున్న స్పందన

మంచిర్యాలటౌన్: జాతీయ ఆయుష్ పథకంలో భాగంగా ఈ నెల 13న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో హోమియోపతి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయుష్ శాఖ వైద్య శిబిరం ఇంచార్జి డాక్టర్ సీహెచ్.స్పందన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా


మాట్లాడుతున్న ఎస్ఈ జాడే ఉత్తమ్

చెన్నూర్: చెన్నూర్ డివిజన్‌లో వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా విద్యుత్ అధికారి జాడే ఉత్తమ్ అన్నారు. స్థానిక సబ్ డివిజనల్ కార్యాలయం ఆవరణలో డివిజన్ స్థాయి ఏఈలు, డీఈలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లూప్‌లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్లను పరిశీలించి ప్రమాదరహిత విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీఈ కైసర్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

'రాజకీయ ప్రయోజనాల కోసమే రిజర్వేషన్ల అంశం'


మాట్లాడుతున్న కలవేన శంకర్

పాతమంచిర్యాల: బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే సామాజిక బాధ్యత ప్రభుత్వం గుర్తించినప్పటికీ అందుకు చట్టబద్ధత చర్యలు లేకుండా కేవలం రాజకీయ లాభాల కోసమే రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకురావడం దురదృష్టకరమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చట్ట పరిధిలో ఆలోచన చేయకపోవడం శోచనీయమని తెలిపారు. బీసీల హక్కుల సాధన పోరాటంలో సీపీఐ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, నాయకులు వెంకటస్వామి, చంద్రశేఖర్, చిప్ప నర్సయ్య, కే.నగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ 2024 మార్చి 31నుంచి పదవీ విరమణ పొందిన వారికి ఇప్పటికీ బెనిఫిట్స్ అందించలేదని తెలిపారు. కుటుంబ అవసరాలకు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరయ్య, ఎమ్మెస్‌రెడ్డి, మాధవరెడ్డి, ఇక్బాల్, కుమారస్వామి, వహిదొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'బోదకాలు'పై సర్వే

- జిల్లాలో 892మంది వ్యాధిగ్రస్తులు
- ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంటు సర్వే(టాస్)కు జిల్లా ఎంపిక
- 20ఏళ్లు పైబడిన వారికి రక్త పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 20బృందాలు ఏర్పాటు


రక్తపరీక్ష నిర్వహణపై ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: జిల్లాలో బోదకాలు(ఫైలేరియా) కేసులు ఎక్కువగా నమోదు అవుతుండడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంటు సర్వే(టాస్)లో భాగంగా జిల్లాలో ఎక్కువగా ఫైలేరియా కేసులు నమోదవుతున్న ప్రాంతంలో ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఈ నెల 13నుంచి 22వరకు రక్త పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 20ఏళ్ల పైబడిన వారిని సర్వే చేసి అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తారు. వ్యాధి నిర్ధారణ కోసం ఇప్పటికే సిద్ధం చేసిన కిట్లపై ల్యాబ్ టెక్నీషియన్లకు ఇటీవల ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ప్రతియేటా బోదకాలుపై సర్వే చేసి గుర్తించిన వారికి మందులు, చికిత్స అందిస్తున్నారు. అయినా కేసులు అదుపులోకి రావడం లేదు. దీంతో కేసులు నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అక్కడి వారిలోని కొందరికి ర్యాండమ్‌గా పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం వ్యాధి బారిన పడ్డ వారికి చికిత్స అందిస్తూనే 2030నాటికి జిల్లాలో బోదకాలు అనేది లేకుండా చేయాలని, ఫైలేరియా నియంత్రణే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ నెల 7న కేంద్ర కీటక జనిత వ్యాధుల అడిషనల్ డైరెక్టర్ (రీజినల్) డాక్టర్ అనురాధ జిల్లాలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు.



ఫైలేరియా టెస్టు కిట్

20బృందాలతో ఇంటింటికి..
బోదకాలు వ్యాధి నిర్ధారణ అయిన గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని 20ఏళ్ల పైబడిన వారిలో ఫైలేరియా ఉందో లేదో తెలుసుకునేందుకు 20 బృందాలు సర్వే చేయనున్నాయి. వ్యాధి నిర్ధారణ కిట్లు ఇప్పటికే వైద్య సిబ్బందికి అందించగా.. వ్యాధి నిర్ధారణ త్వరగా చేసి మందులు, అవసరం మేరకు మెరుగైన వైద్యం కోసం సదుపాయాలు ఉన్న ఆస్పత్రులకు రెఫర్ చేయనున్నారు. దోమకాటు ద్వారా వ్యాప్తిచెందే ఈ వ్యాధి ప్రస్తుతం ఎవరిలో ఉందో గుర్తించి చికిత్స, మందులు అందించడం, వ్యాధిని గుర్తించిన ప్రాంతంలో ఇతరులకు వ్యాధి సోకకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోనున్నారు. గతంలో సర్వే చేసినా అనుమానితుల నమూనాలు మాత్రమే సేకరించేవారు. కానీ ఈ ఏడాది బోదకాలు వ్యాధి సోకిన ప్రాంతంలోని ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేశారు.

చికిత్స, మందులతో నివారణ
ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వారికి క్యూలెక్స్ దోమ కుట్టి ఇతరులను కుట్టడం వల్ల వ్యాధి సోకుతుంది. బాధితుల కాళ్లు పెద్దగా వాపు వచ్చి నడవలేని స్థితిలో బాధపడుతుంటారు. వారి పనులను కూడా చేసుకోలేని పరిస్థితి ఎదురవుతుంది. పురుషుల్లోని కొందరికి కాళ్లవాపులు కాకుండా వృషణాల్లో వాపు వచ్చి బోదకాల వ్యాధికి గురయ్యే అవకాశాలున్నాయి. ఈ వ్యాధి సోకినప్పుడు కాళ్లు, చేతులు, రొమ్ము, వృషణాల్లో ఏదో ఒక చోట పరిమితికి మించిన వాపు కనిపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వారి కాళ్లు, చేతులు స్పర్శను కోల్పోయి పరిమితికి మించిన వాపు పెరగడం వల్ల కదిలించే పరిస్థితి ఉండదు. దీంతో వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు గాను రెండేళ్లకు పైబడిన వారందరికీ ప్రతియేటా మందులు పంపిణీ చేస్తున్నారు. బోదకాల వ్యాధి రాకుండా ఉండేందుకు డీఈసీ మాత్రలు(100ఎంజీ), ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు ఇస్తారు.

పీహెచ్‌సీల వారీగా నమోదైన కేసులు
జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) పరిధిలో 892మంది బోదకాలు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. జన్నారం పీహెచ్‌సీలో 269, తాళ్లపేట్ 14, దండేపల్లి 99, వెంకట్రావ్‌పేట్ 64, హాజీపూర్ 50, మందమర్రి 60, కాసిపేట 47, జైపూర్ 25, కుందారం 5, నస్పూర్ 10, భీమిని 66, అంగ్రాజ్‌పల్లి 5, కోటపల్లి 2, వేమనపల్లి 5, తాళ్లగురిజాల 47, నెన్నెల 29, పాతమంచిర్యాల యూపీహెచ్‌సీలో 19, రాజీవ్‌నగర్ 14, దీపక్‌నగర్ 14, శంశీర్‌నగర్ 16 కేసులు ఉన్నాయి.

కేసులు పెరగకుండా చర్యలు



జిల్లాలో ఫైలేరియా కేసులు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. కీటక జనిత నివారణ కార్యక్రమంలో భాగంగానే వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఫైలేరియా కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో సర్వే చేపట్టనున్నాం. ఇప్పటికే బృందాలు ఏర్పాటు చేసి రక్త పరీక్షలకు కిట్ల వినియోగంపై ల్యాబ్‌టెక్నీషియన్లకు అవగాహన కల్పించాం. ఫైలేరియా కేసులు లేకుండా చేయడమే లక్ష్యంగా కేసుల గుర్తింపు, చికిత్స, కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ అనిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

నిబంధనల ప్రకారం సమాచారం అందించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

మంచిర్యాలఅగ్రికల్చర్: సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు నిబంధనల ప్రకారం సమాచారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అప్పిలేట్ అధికారులు, ప్రజాసమాచార, సహాయ ప్రజా సమాచార అధికారులతో సమాచార హక్కు చట్టం-2025పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం అవశ్యకమని అన్నారు. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా అందజేయాలని సూచించారు. సమాజంలో ప్రతీ అంశంపై అవగాహన కలిగిన పౌరులు సమాజాభివృద్ధికి పునాది వంటి వారని తెలిపారు.

13న అప్రెంటిస్‌షిప్ మేళా
మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 13న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దేవానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి బహుళజాతి కంపెనీలతోపాటు స్థానిక ఇంజినీరింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు వచ్చే వారు సంబంధిత ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు.

కరెంటు కనెక్షన్ లేదు..!


మాలగురిజాల వద్ద పంట పొలాల్లో నేలకు వాలుతున్న తీగలు, కర్ర స్తంభాలు

- ఏళ్లు గడుస్తున్నా స్తంభాలు, తీగలు ఇవ్వని అధికారులు
- తీగల మధ్యలో కర్రలే స్తంభాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వ్యవసాయానికి కరెంటు కనెక్షన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు విద్యుత్ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. విద్యుత్ తీగలు, స్తంభాల కోసం డీడీలు తీసి ఏళ్లు గడుస్తున్నా మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్లాట్లకు మాత్రం స్తంభాలు, తీగలు, లైన్‌లాగడం, కనెక్షన్లు మంజూరు చేయడం వెంటనే జరిగిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు పొలాల వద్దకు ఉన్న పాత స్తంభాల్లో కొంతదూరం కర్రలసాయంతో మరికొంత దూరం సర్వీసు వైరు లాగి మోటార్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

- బెల్లంపల్లి మండలం మాలగురిజాల శివారులో పంట పొలాల్లో స్తంభాల మధ్య ఎక్కువ దూరం ఉండడం వల్ల తీగలు నేలకు వేలాడుతున్నాయి. మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేయాలని గత యాసంగి దిగుబడి సమయంలోనే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. రైతులే తీగల మధ్య కర్రలను స్తంభాలుగా ఏర్పాటు చేసుకున్నారు.
- గతంలో నెన్నెల మండలం గొల్లపల్లికి చెందిన రైతులు విద్యుత్ లైన్ కోసం డీడీలు చెల్లించి నెలల తరబడి ఎదురుచూశారు. ఏఈ డబ్బులు తీసుకున్నా కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ విచారణ చేపట్టి సస్పెండ్ చేయడం తెలిసిందే.

ఏళ్ల తరబడిగా తిరుగుతున్నా..



మాకున్న ఎనిమిది ఎకరాల పొలం కోసం బోరుబావి తవ్వించాం. విద్యుత్ కనెక్షన్ కోసం ఏఈని కలిస్తే నాలుగు స్తంభాలు, తీగలు తదితర సామగ్రి కోసం లైన్ ఎస్టిమేషన్, మ్యాప్ వేసి ఇచ్చారు. 2021 జూన్ 11న మా అమ్మ జాడి పద్మ పేరుతో రూ.5,295 చెల్లించి రశీదు, ఇతర ధ్రువీకరణ పత్రాలు అందజేసిన. కొన్ని నెలల వరకు లైన్ ఇవ్వలేదు. పేపర్లు పోయాయి అంటే మళ్లీ అందజేసిన. తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికేట్ కావాలంటే తీసుకొచ్చిన. ఏళ్ల తరబడి ఏదో కారణం చెబుతూ కనెక్షన్ ఇవ్వడం లేదు. 2023లో విద్యుత్ ప్రజావేదికలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే స్తంభాలు వేశారు. కానీ తీగలు లాగలేదు. కలెక్టరేట్ ప్రజావాణిలో రెండుసార్లు, విద్యుత్ శాఖ డీఈ, ఎస్ఈకి ఫిర్యాదు చేసినా కనెక్షన్ ఇస్తలేరు.

– జాడి హర్షవర్ధన్, శంకర్‌పల్లి, సారంగపూర్, మం: మందమర్రి

'గిరి' చిన్నారులకు మిల్లెట్ ఉప్మ

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహారం
- జిల్లాలో 18 కేంద్రాలు


లింగాపూర్‌లో మిల్లెట్ ఉప్మ తింటున్న చిన్నారులు

దండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చి చిన్నారుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం సంస్కరణలు చేపడుతోంది. చిన్నారుల్లో పోషకాహార లోపాలు అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నేళ్లుగా మధ్యాహ్న భోజనం అమలు చేస్తోంది. గిరిజన పిల్లలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారలోపాన్ని అధిగమించేలా మిల్లెట్ ఉప్మను ఉదయం పూట అల్పాహారంగా అందిస్తున్నారు. మిల్లెట్ ఉప్మ మిక్స్‌ను గిరి పోషణలో భాగంగా గిరిజన సహకార సంస్థ ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తోంది. గత కొన్ని నెలలుగా వీటి సరఫరా నిలిచిపోగా మళ్లీ ఇప్పుడు సరఫరా అవుతోందని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. జిల్లాలో చెన్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు మినహా మంచిర్యాల, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ప్రాజెక్టుల పరిధిలో మొత్తంగా 974 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలోని తోటి, కొలాం గిరిజన పిల్లలు ఉన్న 18 అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రమే ప్రస్తుతం మిల్లెట్ ఉప్మను అల్పాహారంగా అందిస్తున్నారు. లక్సెట్టిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల్లో 203 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటిలో మూడేళ్ల లోపు చిన్నారులు 3,714, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 2,865మంది ఉన్నారు. వీరిలో తీవ్ర పోషణ లోపం గలవాళ్లు 212మంది, అతీ తీవ్ర పోషణ లోపం గలవారు 32మంది ఉన్నారు. తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపాల నివారణకు బాలామృతం, కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాలు అందిస్తున్నారు. లోప పోషణ గలవారికి బాలామృతం ప్లస్ అందజేస్తున్నారు. లక్సెట్టిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తోటి, కొలాం గిరిజన పిల్లలు ఉన్న ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో మిల్లెట్ ఉప్మను అల్పాహారంగా అందిస్తున్నట్లు సీడీపీవో రేష్మ తెలిపారు. జన్నారం మండలం తపాలపూర్, జన్నారం-1, కొత్తపేట, పుట్టిగూడ, దండేపల్లి మండలం లింగాపూర్, ముత్యంపేట, లక్సెట్టిపేట మండలం తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మిల్లెట్ ఉప్మ అందిస్తున్నారు.

బీసీ సంఘాల ఆందోళన.. రాస్తారోకోలు

- రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసన
- భీమారంలో బంద్ ప్రశాంతం


భీమారంలో జాతీయ రహదారిపై బైఠాయించిన నాయకులు

భీమారం: స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించారు. భీమారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. బంద్‌కు పిలుపునివ్వగా వ్యాపారసంస్థలు, ప్రైవేటు పాఠశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. అంతకుముందు బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు ఆవిడం రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీసీ కులాలకు 42శాతం రిజర్వేషన్లు దక్కకుండా అగ్రవర్ణ కులాలు ప్రయత్నాలు చేస్తున్నాయని మాజీ సర్పంచ్ బెల్లంకొండ నరేందర్, ఆవుల సురేష్, వేముల శ్రీకాంత్ గౌడ్, పానుగంటి లక్ష్మణ్ విమర్శించారు. రిజర్వేషన్లను అడ్డుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రాస్తారోకోకు ఇతర కుల సంఘాల నాయకులు కూడా సంఘీభావం తెలిపారు. ఎస్సై శ్వేత ఆందోళనకారులతో మాట్లాడి రోడ్డుపై నుంచి పక్కకు జరిపించారు.

మంచిర్యాలలో..
పాతమంచిర్యాల: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో శుక్రవారం బీసీ సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ మాట్లాడుతూ బీసీలకు హక్కులు రాకపోవడం వల్ల వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన అనేక ఉద్యమాల ప్రభావంతో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామనే హామీతో బిల్లు తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్ల కల్పనకు ముందుకు రావాలన్నారు. రాజకీయ పార్టీలు హైకోర్టుకు తమ అభిప్రాయాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొలిశెట్టి లక్ష్మణ్, కర్నె శ్రీధర్, రమేష్, వైద్య భాస్కర్, రమణాచారీ, రాళ్లబండి రాజన్న, నరసింహ, విద్యార్థి నాయకులు వంశీ పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో రాస్తారోకో


బీసీ రిజర్వేషన్ వ్యతిరేకుల దిష్టిబొమ్మ దహనం

దిష్టిబొమ్మ దహనం..
పాతమంచిర్యాల: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బీసీ రిజర్వేషన్ వ్యతిరేకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, బీసీ సంఘం నాయకులు నామని రాజేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజబాబు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

టీఆర్పీ ఆధ్వర్యంలో..
బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో శుక్రవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీఆర్పీ) నాయకులు, తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే భూకబ్జాలు

- ఓ ధర నిర్ణయించి మరీ ప్రోత్సాహం
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



భూకబ్జాలపై 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని చూపిస్తున్న దివాకర్‌రావు

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములు స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే కబ్జాకు గురవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నస్పూర్‌లోని విలువైన ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని, వాటిని పరిరక్షించాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ప్రతీ గజానికి ఓ ధర నిర్ణయించి మరీ కబ్జాలను ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. ఇన్‌కంటాక్స్ కార్యాలయ స్థలం కబ్జాకు కొందరు చదును చేయగా మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. సదరు భూమిలో బోర్డు తీయించి కబ్జాను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు రూ.30 లక్షలు డిమాండ్ చేశారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. నస్పూర్ శివారులోని 42, 119 సర్వేనంబర్లలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన స్థలాలు కబ్జాకు గురి కాకుండా పరిరక్షించాల్సి బాధ్యత కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ అధికారులపై ఉందన్నారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేశారు. అనంతరం స్థానిక నాయకుల భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఏఓ రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేందర్‌రెడ్డి, నాయకులు వంగ తిరుపతి, బేర సత్యనారాయణ, మేరుగు పవన్, రాజేంద్రపాణి, బాకం నగేశ్, జనార్దన్, పానుగంటి సత్తయ్య, గరిశె రామస్వామి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బృందం


వివరాలు తెలుసుకుంటున్న సందేష్‌రెడ్డి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం అస్కీ బృందం సందర్శించింది. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్ ప్రకారం ఆసుపత్రిలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణ నిర్వహణ తీరు, రోగులకు కల్పిస్తున్న సేవలపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో అస్కీ టీమ్ లీడర్ డాక్టర్ సందేష్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, వైద్యులు మూర్తి, కిరణ్‌కుమారి, షబ్బీర్, సరిత రాథోడ్, నర్సింగ్ సూపరింటెండెంట్ జోసెఫిన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి కుచ్చుల తయారీపై వీడియో చిత్రీకరణ



వరి కుచ్చులతో విజయలక్ష్మి, అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ సమీపంలో శుక్రవారం వరి కుచ్చుల తయారీపై వీడియో చిత్రీకరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన పర్యాటక బృందం అధికారులు చిరాక్, మనీశ్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వరి కుచ్చుల తయారీపై ఫొటో, వీడియో చిత్రీకరించారు. డీఆర్డీవో ఢిల్లీ అధికారులతో కలిసి వరి కోసి కుచ్చులు తయారు చేశారు. లక్ష్మణచాంద, సోన్ ఐకేపీ ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కిష్టాపూర్ వద్ద గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఒక్క ట్రాక్టర్ షెట్‌పల్లి వద్ద, మరో రెండు ట్రాక్టర్లు నర్సింగాపూర్ వద్ద పట్టుబడగా వాటిని పోలీస్‌స్టేషన్ తరలించి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు



చికిత్స పొందుతున్న పూలమ్మ

ముథోల్: మండలంలోని నయాబాదీ కాలనీకి చెందిన పూలమ్మ అనే వృద్ధురాలు కోతి దాడిలో తీవ్రంగా గాయపడింది. వివరాలు.. శుక్రవారం పూలమ్మ తన ఇంటి నుంచి గోధుమలు, జొన్నలు తీసుకుని గిర్నికి వెళ్తుండగా కోతులు ఆమెపై దాడి చేశాయి. గోధుమలు, జొన్నలను చెల్లాచెదురు చేసి ఆమెపై దాడి చేయగా నడుము భాగంలో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు చికిత్స అందించారు.

కిరాణా షాపులో చోరీ

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామంలో కొటారపు భీమన్నకు చెందిన కిరాణా షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. భీమన్న షాపునకు తాళం వేసి మంచిర్యాల ఆస్పత్రికి వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. రూ.30వేల నగదు, రూ.7వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఆస్పత్రి నుంచి వచ్చిన భీమన్న దుకాణంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రసాద్ సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

చెట్ల నరికివేతపై విచారణ

దండేపల్లి: మండలంలోని తానిమడుగు ప్రత్యేక బీట్‌లో దసరాకు ముందు చెట్లు నరికివేసినట్లు వీడియోలు వైరలయ్యాయి. దీనిపై అటవీ శాఖ అధికారులు తానిమడుగు బీట్‌లో రెండు రోజులు పర్యటించి పరిశీలించారు. 40చెట్లు నరికివేసినట్లు గుర్తించారు. వాటి విలువ రూ.2.80 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కాగా, ఈ ఘటనలో కొంతమందిని అనుమానిస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

వైకుంఠధామం గేటు చోరీ



కిష్టాపూర్ వైకుంఠ ధామం కమాన్

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని వైకుంఠధామానికి చెందిన ఇనుప గేటును దొంగలు ఎత్తుకెళ్లిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన యువకులు ఈ విషయాన్ని గ్రామ వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి గోపీచంద్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అనూష వైకుంఠధామం పరిసర ప్రాంతాలను పరిశీలించి త్వరలో నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

మహిళలు.. మహారాణులు!

- స్వయం ఉపాధి వైపు అతివల చూపు
- తక్కువ వడ్డీ రుణాలతో వ్యాపారాలు
- పురుషులకు దీటుగా రాణిస్తున్న వైనం
- ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు..

తానూరు: మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఇంటిని చక్కదిద్దడమే కాదు.. కుటుంబ పోషణకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. విద్య, రాజకీయం, ఉద్యోగాలతో పాటు వ్యాపారంలోనూ రాణిస్తున్నారు. డ్వాక్రా సంఘంలో తక్కువ వడ్డీకి రుణాలు తీసుకుని కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న కొందరు మహిళలపై కథనం..



తానూరులో ఎంబ్రాయిడరీ శిక్షణ ఇస్తున్న పద్మ

గ్రామంలోనే వ్యాపారం చేస్తున్న

డ్వాక్రా సంఘంలో రూ.5లక్షలు రుణం తీసుకుని గ్రామంలోనే బట్టల షాపు, లేడీస్ టైలర్, ఎంబ్రాయిడరీ, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న. స్వయంగా దూరప్రాంతాలకు వెళ్లి కొత్త కొత్త నమూనాలు ఎంపిక చేసి తీసుకువస్తున్న. కస్టమర్లు కోరిన నమూనాలు అందిస్తున్న. పదిమందికి కుట్టు శిక్షణ కూడా ఇస్తున్న. వ్యాపారంలో వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణకు సహకారం అందిస్తున్న.

– పద్మ, తానూరు



తానూరులో యువతులకు కుట్టు శిక్షణ ఇస్తున్న విజయలక్ష్మి



కోలూరులో మట్టి ప్రమిదలను చూపుతున్న చంద్రబాయి

ప్రమిదలు తయారు చేస్తున్న

గ్రామంలోని స్వయం సహాయక సంఘం ద్వారా రుణం తీసుకుని మట్టి ప్రమిదలు తయారు చేస్తున్న. వాటిని స్వయం సహాయక సంఘాలు, మార్కెట్‌కు సరఫరా చేస్తూ లాభాలు పొందుతున్న. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు ఐదువేల ప్రమిదలు సరఫరా చేసేందుకు అధికారుల నుంచి ఆర్డర్ వచ్చింది. రుణం తీసుకుని కులవృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న.

– చంద్రబాయి, కోలూరు



తానూరులో ఆర్‌సీఎం షాపు నిర్వహిస్తున్న అంజనాబాయి

ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న

సంఘంలో రుణం తీసుకుని ఆర్‌సీఎం హోల్‌సేల్ షాప్ ప్రారంభించిన. వ్యాపారంలో కొనసాగుతూ లాభాలు గడిస్తున్న. వ్యాపారంలో వచ్చిన ఆదాయాన్ని రుణ వాయిదాలు చెల్లించి మిగతా డబ్బులను కుటుంబ పోషణ కోసం ఖర్చు చేస్తున్న. కొంత మొత్తాన్ని పొదుపు కూడా చేస్తున్న. నా భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ ఆర్థికాభివృద్ధి సాధించడం సంతోషంగా ఉంది.

– అంజనాబాయి, తానూరు

ఇంటి పనులు చేసుకుంటూనే..

డ్వాక్రా సంఘంలో తక్కువ వడ్డీకి రుణం తీసుకుని మార్కెట్‌లో బ్యూటీ పార్లర్, లేడీస్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మ్యాచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న. మా పిల్లలను పాఠశాలకు పంపించి ఇంటి పనులు ముగించుకుని వ్యాపారం చేస్తున్న. టైలరింగ్‌లో యువతకు శిక్షణ ఇస్తున్న. ఒక వ్యాపారం చేస్తున్నప్పుడే కొత్త ఆలోచనలకు అవకాశం కలుగుతుంది. సమాజంపై అవగాహన వస్తుంది.

– విజయలక్ష్మి, తానూరు

కిరాణా షాపు నిర్వహిస్తున్న



డ్వాక్రా సంఘం ద్వారా తక్కువ వడ్డీకి రుణం తీసుకున్న. గ్రామంలోనే కిరాణా షాపు ప్రారంభించిన. దుకాణం ద్వారా వచ్చిన ఆదాయంతో రుణ వాయిదాలు చెల్లిస్తున్న. మిగిలిన మొత్తం కుటుంబ పోషణ, పిల్లల చదవుకు ఖర్చు చేస్తున్న. రుణాలు సక్రమంగా చెల్లిస్తే అధికారులు మళ్లీ అడిగినంత రుణం ఇస్తున్నరు. సొంతంగా కిరాణా దుకాణంతో ఉపాధి పొందడం ఆనందంగా ఉంది.

– శోభ, కోలూరు

స్త్రీశక్తి ద్వారా రుణాలిస్తున్నాం



గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు వ్యాపారం చేసుకోవడానికి స్త్రీశక్తి ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నాం. స్వయం ఉపాధి వైపు వారిని ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే తానూరు మండలంలో 725 మహిళా సంఘాలు కొనసాగుతున్నాయి. ఈ సంఘాలకు రూ.16కోట్ల రుణాలందించాం. రుణాలు పొందిన మహిళలు వ్యాపారాలు కొనసాగిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు.

– సులోచనరెడ్డి, ఐకేపీ ఏపీఎం

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న వెంకటేశ్వరస్వామి

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14, 17 బాలబాలికల అథ్లెటిక్ ఎంపిక పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాసిపేట జెడ్పీహెచ్‌ఎస్ సహకారంతో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 600మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరస్వామి, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ యాకూబ్, పాఠశాల హెచ్‌ఎం సాంబమూర్తి, పర్యవేక్షకులు రేణి రాజయ్య, భూక్యా రాజన్న, పీడీ మారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వాలీబాల్ ఎంపిక పోటీలు

ఈనెల 11న పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో లక్సెట్టిపేట జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు) పాఠశాలలో అండర్–17, 14 బాలికల జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకూబ్ ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

ఐదుగురు ఉద్యోగులపై కేసు

మందమర్రిరూరల్: ఆగస్టు చివరి వారంలో మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో విధి నిర్వహణ విషయంలో ఇరువురు జాతీయ కార్మిక సంఘాల నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిపై ఓ సంఘం నాయకుడు మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. కేసు నమోదు చేయకుండా పలుసార్లు రాజీ కోసం ప్రయత్నించగా ఫిర్యాదుదారు నిరాకరించారు. దీంతో ఉన్నతాధికారుల ప్రమేయం, కోర్టు ఆదేశాల మేరకు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎస్సై రాజశేఖర్‌ను వివరణ కోరగా.. కోర్టు అనుమతితో గురువారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇది సింగరేణి చరిత్రలో మొదటి కేసుగా పలువురు పేర్కొంటున్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు మాటామాట అనుకుంటే గని ఉన్నతాధికారి వద్ద ఫిర్యాదు చేసుకుంటే సదరు అధికారి సర్ది చెప్పేవారు. లేదా నోటీసులివ్వడమో, సంజాయిషీ కోరడమో, రాజీ కుదుర్చడమో జరిగేది. దీంతో గొడవలు సద్దుమణిగేవి. కానీ, కేకే ఓసీలో జరిగిన ఘటన కేసు వరకు రావడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పుస్తక రచనలో జిల్లా ఉపాధ్యాయులు



అందుబాటులోకి వచ్చిన తెలుగుఅకాడమీ పుస్తకం



నారాయణవర్మ, వందనకుమారి

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ తెలుగు అకాడమీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే పుస్తక ప్రచురణ సంస్థ. సంస్థ డీఎస్సీకి రూపొందించిన స్టడీ మెటీరియల్‌లో భౌతిక రసాయన శాస్త్రం కంటెంట్ పుస్తక రచనలో నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. కడెం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పీ నారాయణవర్మ, తానూరు మండలం భోసి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు సీహెచ్ వందనకుమారి భాగస్వాములయ్యారు. గత జనవరిలో ఈ పుస్తకం తుదిరూపు దిద్దుకోగా తాజాగా ప్రచురితమై అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పుస్తకం డీఎస్సీ, టెట్ పరీక్షల కోసం తెలుగు మీడియం వారికి ప్రయోజనకారిగా ఉండనున్నట్లు పుస్తక రచయితలు తెలిపారు. వీరిరువురు 24 ఏళ్లుగా సైన్స్ ఫెయిర్, ప్రాజెక్ట్ పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంచడంలో సఫలీకృతులయ్యారు. పాఠ్యాంశాల బోధనలోనూ తమదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

పేగు బంధానికి వీడ్కోలు

- కొడుకు చితికి నిప్పు పెట్టిన తల్లి



నరేశ్ (ఫైల్)



నరేశ్ అంతిమయాత్రలో తల్లి రాజమ్మ

తాండూర్: జీవిత చరమాంకంలో తనకు తలకొరివి పెట్టి నరకం నుంచి తప్పిస్తాడనుకున్న ఆ కొడుకుకు కన్న తల్లే తలకొరివి పెట్టింది. ఈ విషాద ఘటన మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. మాదారం టౌన్‌షిప్ గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికురాలు సలాకుల రాజమ్మకు రమేశ్, నరేశ్ ఇద్దరు కుమారులున్నారు. వీరిలో రమేశ్ ఏడాది క్రితమే అనారోగ్యంతో మరణించాడు. ఆ విషాదం నుంచి ఇంకా తేరుకోకముందే ఆ తల్లిని మరో చేదు వార్త వెంటాడింది. చిన్న కుమారుడు నరేశ్ కూడా ఫిట్స్‌తో గురువారం మృతి చెందాడు. దీంతో ఆమె అంతులేని శోకాన్ని అనుభవించాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం నరేశ్ అంత్యక్రియలు నిర్వహించగా తల్లి రాజమ్మే కుండపట్టి కొడుకును కాటివరకు సాగనంపింది. తీవ్ర దుఃఖాన్ని దిగమింగుతూ కొడుకు చితికి నిప్పంటించి పేగు బంధానికి కన్నీటి వీడ్కోలు పలికింది. రాజమ్మ రోధించిన తీరుకు పలువురు కంటతడి పెట్టుకున్నారు. నరేశ్‌కు భార్య, కుమార్తె ఉంది. ఏడాది వ్యవధిలోనే రాజమ్మ ఇద్దరు కుమారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటకృష్ణ

రెబ్బెన: మండలంలోని రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఖాళీ స్థలం వాగు ఒడ్డు వద్ద శుక్రవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాల సమీపాన ఉన్న అహ్మద్‌బిన్ మహ్మద్ ఖాళీ స్థలంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు 55–60 ఏళ్లు ఉంటుందని, 5.3 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై మెరూన్ రంగు డ్రాయర్, నీలి రంగు టీషర్టు ఉన్నట్లు తెలిపారు. భిక్షాటన చేస్తూ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుంటాడని, శుక్రవారం తెల్లవారుజామున ఆకలితో మృతి చెంది ఉంటాడని ఎస్సై భావిస్తున్నారు. కాగా, మృతుడి సమాచారం తెలిసినవారు 8712670532 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఒకరిపై పోక్సో కేసు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని గాంధీనగర్‌కు చెందిన ఎర్రల వర్ధన్‌పై పోక్సో చట్టం కింద ఈ నెల 8న కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7న వర్ధన్ ఓ బాలిక ఫొటోలను ఆమె సమ్మతి లేకుండా అతని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై ఆమె ప్రశ్నించినందుకు బాలికతోపాటు ఆమె మేనమామను కూడా బెదరించాడు. తనను వెంబడిస్తూ ఫొటోలు పోస్టులు చేసి మానసికంగా వేధిస్తూ, తన ఇంటి వద్ద గొడవ చేసి తనను నెట్టేసిన వర్ధన్‌పై చర్య తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌పై దాడి



ట్రాక్టర్ యజమానులు, అధికారుల మధ్య జరుగుతున్న వాగ్వాదం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని రాస్పెల్లి శివారు అటవీ భూమి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబు పాటేకర్, అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. వాటిని రాస్పెల్లి నుంచి కాగజ్‌నగర్ రేంజ్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ యజమాని నాసిర్‌అలీ ఖాన్ అడ్డుకుని ఫారెస్ట్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. తాను పట్టా భూముల నుంచి మాత్రమే ఇసుక తరలిస్తున్నానని, అది అటవీ ప్రాంతం కాదని వాదించాడు. అయితే నాసిర్‌అలీ ఖాన్ తమ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై దాడి చేశారని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బాబుపాటేకర్ ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాసిర్‌అలీఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈజ్‌గాం ఎస్సై కల్యాణ్ తెలిపారు. పట్టుకున్న ఆరు ట్రాక్టర్లను రేంజ్ కార్యాలయానికి తరలించారు.

మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య

నిర్మల్ రూరల్: మండలంలోని అనంతపేట గ్రామానికి చెందిన బొబ్బిలి నరేందర్ యాదవ్ (27) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడ్డట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. నరేందర్ యాదవ్ కొంతకాలంగా మద్యానికి బానిసై తన భార్యను నిత్యం వేధించేవాడు. దీంతో ఆమె కొంతకాలం క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన నరేందర్ గురువారం సాయంత్రం గ్రామ శివారులో మద్యం మత్తులో పురుగుల మందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జిల్లా కేంద్రంలోని ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అన్నం పెట్టినోడికే కన్నం..

ఆదిలాబాద్‌టౌన్: అన్నం పెట్టినోడికే కన్నం పెట్టిన సామెత ఈ ఘటనకు అద్దం పడుతోంది. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన జీ అశోక్ ఇంటి సమీపంలో అపరిచిత వ్యక్తి శుక్రవారం కూర్చొని ఉన్నాడు. అతడి వద్దకు వెళ్లిన అశోక్ ఇక్కడ ఏం చేస్తున్నావని అడగగా, తనకు ఆకలి అవుతోందని అన్నం పెట్టమని కోరాడు. దీంతో బాధితుడు తన ద్విచక్ర వాహనాన్ని నడపమని చెప్పి తాను వెనుక కూర్చున్నాడు. తెలంగాణ చౌక్ ప్రాంతంలో మద్యం తాగించి భోజనం చేయించాడు. ఈ క్రమంలో అశోక్ అక్కడే ఉండగా నిందితుడు బైక్ తీసుకుని పారిపోయాడు. సీసీ ఫుటేజీలో ఈ దృశ్యం రికార్డయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ వివరించారు.

ఆర్జీయూకేటీలో మానసిక ఆరోగ్య దినోత్సవం



కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అధికారులు, విద్యార్థులు

బాసర: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం మానసిక స్వస్థత కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవడానికి ఉదయం వ్యాయామం, ధ్యానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శారీరక వ్యాయామాలు, ధ్యానం, మానసిక ఆరోగ్య అవగాహన కోసం క్యాంపస్‌లో ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఆర్జీయూకేటీ మానసిక స్వస్థత కేంద్రం సిబ్బంది, శారీరక విద్యావిభాగ సిబ్బంది పాల్గొన్నారు.

నెమలిని చంపిన నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్ఆర్వో

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామ సమీపంలోని చేనులో ముగ్గురు వ్యక్తులు జాతీయ పక్షి నెమలిని చంపారు. ఎఫ్ఆర్వో ప్రణయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాదిగూడ మండలం ఖాండురాంపూర్ గ్రామానికి చెందిన బడ్వాల్ గంగాసింగ్ బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 9న చేనులో గడ్డి కోస్తూ ఉండగా గంగాసింగ్‌కు నాలుగు నెమలి గుడ్లు కనిపించాయి. దీంతో అక్కడికి నెమలి వస్తుందని గమనించాడు. పొచ్చెర గ్రామంలోనే వలస కూలీలుగా ఉన్న గాదిగూడ మండలం లోకారికి చెందిన దత్తు, ఇంద్రవెల్లి మండలం గోపాల్‌పూర్‌కు చెందిన బాలాజీతో కలిసి గురువారం రాత్రి గుడ్లపై పొదిగిన నెమలిని కర్రతో కొట్టి చంపాడు. నెమలి, గుడ్లను బైక్‌పై తీసుకెళ్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు వారి ద్విచక్రవాహనం ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద చని పోయిన నెమలి, గుడ్లు కనిపించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న యువకుడి అరెస్ట్



జైపూర్: గంజాయి మొక్క, నిందితుడితో ఎస్సై



ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసుల అదుపులో నిందితుడు

జైపూర్: గంజాయికి అలవాటు పడిన యువకుడు ఏకంగా ఇంటి సమీపంలోనే మొక్కలు పెంచుతుండడంతో పక్కా సమాచారం మేరకు పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన బొద్దున సత్యనారాయణ అనే యువకుడు గంజాయికి అలవాటు పడ్డాడు. తన ఇంటి సమీపంలోనే గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీధర్, తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. సత్యనారాయణ ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించి చెన్నూర్ కోర్టులో హాజరు పరిచారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, సాగు చేసినా కఠినచర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

తిర్యాణి మండలంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: తిర్యాణి మండల పరిధిలోని చెలిమెల గ్రామం కొద్దుగూడ శివారులో ఆత్రం పాపారావ్ (32) తన కంది చేనులో గంజాయి సాగు చేస్తుండగా అతడిపై కేసు నమోదు చేసినట్లు తిర్యాణి ఎస్సై వెంకటేశ్ తెలిపారు. 10గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వాంకిడి: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మండలంలోని జాతీయ రహదారిపై ఖమాన ఎక్స్ రోడ్ సమీపంలో చోటు చేసుకుంది. ప్రమాదంలో ఖమాన గ్రామానికి చెందిన విలాస్, భూమయ్య, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లలిత్ గాయాలపాలయ్యారు. వారిని చికిత్స కోసం నేషనల్ హైవేకు చెందిన అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి సంబంధించిన వివరాల కోసం ఎస్సై మహేందర్‌ను సంప్రదించగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.